ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక: 12-4-1989

# అర్థానుస్వారం

నేనా ఊరు కొత్తగా వెళ్ళాను. తెలిసిన మిత్రులు, కావలసిన బంధువులు ఎవ్వరూ లేరు. హోటల్లో రూం, తిండి, పడక. ఆఫీసులో పగలంతా పని.

ఒకళ్లిద్దరు మిత్రులతో... అంటే నా క్రింద పనిచేసే ఉద్యోగస్తులతో చెప్పా, 'నాకో ఇల్లు కావాలి' అని.

కొందరు 'చూస్తాం' అన్నారు. మరికొందరు 'సెల్వనాయిగం'తో చెప్పండన్నారు.

"సెల్వనాయిగం ఎవరు?"

"మీ డిపార్ట్‌మెంట్‌లోనే ఉంటా"డన్నారు.

"సరే" అని సెల్వనాయిగం కోసం కబురెట్టా. వారం రోజులు మనిషి అయిపు

లేదు.

సెలవా? ఎటెండెన్స్ రిజిష్టర్ తెప్పించి చూశా. కొన్ని రోజులు సంతకాలున్నాయి. మరికొన్ని రోజులు అవీ లేవు.

"సెల్వనాయిగం రాగానే నన్ను కలవమనండి" అని ఉత్తర్వులు వేశా. ఫలితం లేదు. మా ఆవిడ ఉత్తరాల మీద ఉత్తరాలు! లేదా ఆఫీసుకు ఫోను.

"ఏమిటీ మీ ఉద్దేశం? హాయిగా సత్రం భోజనం, మఠం నిద్రా బావుందా? లేక పెళ్ళాం పిల్లలు గుర్తు రాకుండా, ఎవరన్నా సంతోషపెడుతున్నారా? మీ సుఖం, సంతోషం సరే, నా సంగతి ఆలోచించండి. ఇదిగో 'మరో వారంలో వస్తా' అన్నారు - నెలయింది ఉత్తరం. తప్ప, మీ జాడ లేదు. మీరు పగలంతా ఆఫీసులో మునిగిపోతే ఇల్లు దొరకదు. సెలవు' పెట్టన్నా తిరగండి. మీరు చూద్దాం అంటూ ఉంటే, నేనేదో రోజు, సైన్య సమేతంగా వచ్చి, మీ ఆఫీసులో వాల్తా.

'పెద్దాడు చదవటం లేదు. అదేమిరా అంటే, 'కొత్త ఊరెడుతున్నాంగా! అక్కడ స్కూల్లో చేరాక కొత్త పుస్తకాలు, మాస్టర్లు, ఫ్రెండ్సు గదా' అంటాడు. పిల్ల ఏడుపో కోపమో వస్తే, 'నే నాన్నారి దగ్గరి కెడతా' అని వీధిన పడుతున్నది. పసివాడు సరేసరి! రెండ్రోజులు కేరింతలు పెడతాడు. ఓ రోజు వాంతులో, జ్వరమో, మరొకటో!

"మీ అమ్మగారు ఆయాసంతో కాలక్షేపం చేస్తున్నారు. మీ తమ్ముడు రాత్రులు సినిమాలు, టీవీ చూడటాలు. పగలు నిద్ర.

"మహాప్రభో త్వరగా నన్నీ అశోకవనం నుంచి తీసుకుపోండి" - ఇలా ఉత్తరాలు.

నెలాఖరున జీతాలిచ్చే క్యాషియరుకు చెప్పా - "సెల్వనాయిగం వస్తే జీతం ఇవ్వకు. నా దగ్గరకు పంపు" అని!

సెల్వనాయిగం జీతానికి రాలేదు. ఓరి వీడి అసాధ్యం గూల! నెలంతా ఆఫీసుకు రాకపోయినా, జీతానికన్నా రాని వాడేం మనిషి? వాడికి జీతం, ఉద్యోగం అంటే లెక్క లేదా? అదే అడిగా తోటి వాళ్ళను.

"వాడిని చూడండి. వాడికోపని చెప్పండి. అది చేశాక వాడి సంగతి మీకు తెలుస్తుంది. వాడిని గురించి మేమేం చెప్పినా మీకు తెలియదు!" అన్నారు.

నేను ఆఫీసు లెడ్జర్లు, బ్యాలన్స్ షీట్లు - వీట్లతో మునగానాం, తేలానాం అంటుండగా, మా ఆవిడ, సైన్య సమేతంగా రానే వచ్చేసింది.

బుట్టలు, పక్కచుట్టలు, జాడీలు, డబ్బాలు, రేకు పెట్టెలు, ఉయ్యాల, పిల్లలు, పుస్తకాలు... వీటన్నిటితో విచ్చేసి, మా తమ్ముడిని నా కోసం పంపింది!

మా తమ్ముడు వచ్చీరాని హిందీ, వచ్చునుకున్న ఇంగ్లీషు రెండూ కలిపి, ఒక్కో అంతస్తులో నా పేరు ఉద్యోగం చెప్పుకుంటూ, ప్రతి గదీ వెతుక్కుంటూ వచ్చేసరికి, నేను మా ఎం.డీ పిలిస్తే లేచి వెళ్ళబోతున్నా.

కథా నిలయం
శ్రీకాకుళం

ఎదురుగా తమ్ముడు రాజు.

"ఏమిరా? కూర్చో వస్తా" అని పోబోతుంటే, "వదిన పిల్లలు, అమ్మ అంతా వచ్చాం! అంతా కింద కారులో ఉన్నారు" అన్నాడు.

అటు ఎం.డీ.... వెళ్ళకపోతే, పీక కోసి, చేతి కిచ్చేస్తాడు.

ఇటు, స్వజనం, ఊరు కాని ఊరు, భాష రాని ప్రదేశం. ఎలాగా అని కర్తవ్యతా విమూఢుడనై ఉండగా అదిగో అప్పుడు-

"సార్! నేను సెల్వనాయిగం" అంటూ వచ్చాడు ఓ పాతికేళ్ళవాడు.

హోటల్ పేరూ, రూం నెంబరూ చెప్పి, మా స్వజనాన్ని, అక్కడికి చేర్చి, తిండీ, తిప్పలూ చూడమని చెప్పి, నేను ఎం.డీ. బోనులోకి పరిగెత్తా. ఆ పోవడం పోవడం బయటపడే సరికి ఓ రెండు గంటలు పట్టింది.

మా ఎం.డి. నన్ను చితకబాది, నానేసి, ఉతికి, పిండి వదిలాడు. మా ఎం.డి.కి మనిషి దొరికితే, గిచ్చి నంజుకోవడం సరదా. అందునా, వచ్చిన మనిషి త్వరగా బయట పడదామన్న ఆలోచనలో ఉన్నాడని గ్రహిస్తే ఇహ వేపుకు తినడం ఆయనకు హాబీ.

నే లేవబోవడం, ఆయన అప్పుడే ఏదో గుర్తొచ్చిన వాడిలా మరో విషయ ప్రస్తావన తేవడం - ఇలా మా ఇద్దరి మధ్య పులి - మేకా జూదం అయి, బయటపడే సరికి మాడిన పోపులా, ఉండచుట్టి విసిరేసిన చిత్తు కాగితంలా అయ్యాను. అప్పుడు హోటల్‌కి ఫోన్ చేశా.

"మా వాళ్ళు రూం ఖాళీ చేసి వెళ్ళా"రన్నది రిసెప్షనిస్ట్ చెబితే, నే కంగుతిన్నా.

సెల్వనాయిగం, నే చెప్పింది సరిగ్గా వినలేదా? లేక హోటల్ వాడు, ఇంకెవరి గురించిన సమాచారమన్నా నాకు చెప్పాడా? తేలలేదు.

పోనీ వెడదామంటే, ఎం.డి. గారు, "ఫలానా రిపోర్ట్ అర్జెంటు - సాయంత్రం విమానంలో ఢిల్లీ వెడుతున్నా. అప్పటికి నాకు అందివ్వు" అని ఫర్మానా జారీచేసి వెళ్ళాడు.

రిపోర్టు తయారు చేసి, సరిచూసి, తీసుకుపోయి ఎం.డి. కిచ్చేసరికి రాత్రి ఏడయింది. ఆయన వెంట ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళా! దారంతా నన్ను ప్రశ్నలతో, అనుమానాలతో సూదిపెట్టి పొడుస్తూనే ఉన్నాడు.

నే హోటల్‌కు వెడితే, రిసెప్షన్‌లో సెల్వనాయిగం ఉన్నాడు.

నన్ను చూసి, "సార్! అంతా సెటిల్ చేస్తిని. మీరుదా వస్తే వెడదుం" అన్నాడు.

"ఎక్కడకు?"

"సెబుతా సార్!"

టాక్సీలో ఇద్దరం బయలుదేరాం.

కలకత్తా మహానగరంలో, రాత్రి పూట, పద్మవ్యూహంలోకి వెడుతున్నట్లనిపించింది నాకు, కొత్తగా పట్నం వచ్చిన వాడిలా కారు విండోలోంచి మేడలు, వీధులు చూస్తూ

వెళ్ళా - వింతగా, ఆశ్చర్యంగా!

సెల్వనాయిగం, బెంగాలీలో డ్రైవరుకు పోవాల్సిన వీధులు, సందులు చెప్పి, మధ్య మధ్యలో నా వేపు చూసి, ఓ చిరు మందహాసం చేశాడు, దారి పొడుగునా.

రాస బీహారి వీధిలో ఓ పెద్ద భవనం ముందు కారాగింది. డ్రైవరుకు డబ్బులు సెల్వనాయిగం ఇచ్చాడు. ఆరో అంతస్తులో 612 నెంబరు ఫ్లాట్ దగ్గరకు తీసుకెళ్ళాడు. బయట బోర్డులో శివసుబ్రహ్మణ్యం అని పేరు చూశా.

లోపలకు వెడితే, మా అమ్మ సోఫాలో జారగిలబడి టీవీలో బెంగాలీ సంగీతం ఆస్వాది స్తున్నది.

మా తమ్ముడు, కొడుకు, కూతురు, ఎక్వేరియం దగ్గర చేరి రంగు రంగుల చేపల విన్యాసాలు చూస్తున్నారు.

మా ఆవిడ లోపల బెడ్ రూంలో అలంకరించుకుంటున్నదల్లా, కొత్త పెళ్ళి కూతురిలా నవ్వుతూ వచ్చింది.

మా బుడత, ఎ.సి. రూంలో గాఢనిద్రలో ఉంది.

విశాలమైన డ్రాయింగ్ రూంలో గోడలకు అందమైన డెకొరేటెడ్ వాల్ పేపర్స్, మూలల్లో తళతళ మెరిసే ఇత్తడి గిన్నెల్లో ఫ్లవర్‌పాట్స్, నేలపైన అందమైన తివాచీ సోఫాలు.. ఇదంతా నాకు మయసభలా తోచింది.

ఆశ్చర్యంగా చూశా సెల్వనాయిగం వేపు.

"ఆ ఫోజులు తర్వాత! ముందెళ్ళి బాత్‌రూంలో గీజర్ వేసుకుని షవర్‌బాత్ చేసిరండి. నే నీలోపల డైనింగ్ టేబుల్ మీద అన్నీ సర్దేస్తాను". మా ఆవిడ తొందర చేసింది.

సెల్వనాయిగం చిరునవ్వు నవ్వి, "అట్లుదా సేయుడు సార్. నాన్ మార్నింగ్ వస్తును" అని నాతో చెప్పి "అమ్మణ్ణీ! లిస్ట్ నాదానె వుంది అంజి మణికి వస్తునమ్మ" అని మా ఆవిడకి చెప్పి, "బామ్మవారు వస్తును" అని మా అమ్మకు చెప్పి వెళ్ళాడు.

'అటజనిగాంచె భూమిసురుడు' అన్న ప్రవరాఖ్యుడిలా ఉంది నా పరిస్థితి.

చెప్పా పెట్టకుండా, వచ్చిన పరివారాన్ని ఎక్కడ ఉంచడమా అని బుర్రంతా వేడెక్కి వచ్చిన నాకు, ఆ ఇల్లు, అందులో సెటిల్ అయిపోయిన నా కుటుంబ సభ్యులు, ఇదంతా ఏమిటి? నేమన్నా కల గంటున్నానా అనిపించింది.

డైనింగ్ టేబుల్ దగ్గరంతా మా ఆవిడ నా మీద యుద్ధం, ఈసడింపులు, కోపాలూ, సరసాలూ ప్రదర్శన చేయక సెల్వనాయిగం పొగడ్త ప్రారంభించింది, ఆవిడ అన్నం వడ్డిస్తూ. బెడ్‌రూంలోకి పోయి ఫోం బెడ్ మీద పద్మాసనం వేసుకుని తమలపాకుల ఈనెలు తీస్తూ, మధ్య మధ్య పండిన తన నాలుకను చూసుకుంటూ, ఎదురుగా ఉన్న పెద్ద డ్రస్సింగ్ టేబుల్ మిర్రర్‌లో తన అందాన్ని పరీక్షించుకుంటూ చెప్పిన విశేషాలు అన్నీ, క్రోడీకరిస్తే -

సెల్వనాయిగం, నా దగ్గర్నుంచి బయలుదేరి కింద కారు దగ్గరికొచ్చి, ముందు మా అమ్మ వాళ్ళకు నమస్కరించి, ఆ తర్వాత మా ఆవిడకు తన పేరు చెప్పుకున్నాడు.

"అడడా" అని మా చంటివాణ్ణి బుగ్గ గిల్లి, ఎత్తుకుని, ముద్దాడి, ఆడించి, ఆ తర్వాత మా అమ్మాయిని చేరదీసి, తనూ ఆ కారులోనే బయలుదేరబోయి, చోటు చాలదని గ్రహించి, మా ఆఫీసు వ్యాను తీసుకున్నాడు. అందులో తనూ, పిల్లలు, కూర్చుని, మా అమ్మ దగ్గర కెళ్ళి, "బామ్మవారు, సౌఖ్యంగా పూడ్చుండి" అని చెప్పాడు.

'రాజు వెడలె రవితేజము లలరగ' అన్నట్లు బయలుదేరి, దారిలో ఓ రెస్టారెంటు దగ్గర కారు ఆపేశాడట. మా అమ్మకు చల్లని మజ్జిగ, మా ఆవిడకు, తమ్ముడికి కూల్‌డ్రింక్స్ ఇప్పించి, పిల్లలకు ఐస్‌క్రీం పెట్టించాడు. వీళ్ళంతా మహానందంతో, తేలియాడుతుండగానే సెల్వనాయిగం ఎక్కడికో వెళ్ళొచ్చాడు.

అక్కణ్ణుంచి, నేనుండే హోటల్‌కు వెళ్ళి రూం ఎకౌంట్ సెటిల్ చేసి, నా సామానంతా తీసుకుని వేన్‌లో వేసుకుని, ఈ ఇంటికి తెచ్చి దింపాడట.

"సెల్లెమ్మా జలకం సేయండి. నేను దా భోజనం తెస్తును" అని వెళ్ళాడట.

పరివారమంతా ఇంట్లోపడి, ప్రతి గదీ, అందులోని వస్తువులూ పరీక్షలు చేసి, స్నానాలూ అవీ అయ్యేసరికి సెల్వనాయిగం పెద్ద క్యారేజీల నిండా మద్రాసు హోటల్ నుంచి భోజనం తెచ్చాడు.

మా అమ్మకు పళ్ళు, పసివాడికి పాలు తెచ్చి ఇచ్చాడుట. అంతేగాదు. రాత్రి వంటకు కావలసిన కూరలు, బియ్యం, వెచ్చాలు లిస్టు రాసుకుని తీసుకుని, అన్నీ తెచ్చి పడేశాడుట.

"అది సరేనండీ! మీరొచ్చి, ఇన్నాళ్ళయినా, అతనితో, ఇలా మా వాళ్ళొస్తారు, ఇల్లు కావాలని చెప్పలేదుటేం?" మా ఆవిడ నిలేసింది.

"ఇంకా ఏం చెప్పాడేం?"

"అబ్బో, వట్టి వాగుడు కాయండి. పిల్లలకు స్కూళ్ళల్లో ఏయే క్లాసుల్లో ఎడ్మిషన్లు కావాలి అని అడిగాడు. మా తమ్ముడికి ఉద్యోగం కావాలన్నా ఇప్పిస్తాడట. ఇక్కడకు దగ్గర్లోనే ఆలయం ఉందిట. మీ అమ్మగార్ని సాయంత్రం తీసుకెళ్లాడు".

మా ఆవిడ చెబుతుంటె నాకు ఆశ్చర్యమూ, సందేహమూ కలిగాయి- సెల్వనాయిగం ప్రతిభకూ, మనుషులను వశం చేసుకోవడంలో అతని సామర్థ్యానికీ!

"సెల్వనాయిగం భలేవాడండి. ఎల్లా తెలుసుకుంటాడో ఏమో, మనసులో అనుకుంటే చాలు గ్రహించేస్తాడు. పిల్లదానికి పోతపాలని ఎలా గ్రహించాడో ఏమో, మాకు అన్నాలు తెస్తూ, దానికి పాలు తెచ్చాడు."

"అవునూ, వీటన్నిటికీ ఎంత ఖర్చయింది?"

"ఏమో నాకేం తెలుసు? అన్నీ అతగాడే తెచ్చాడు. డబ్బులిద్దాం అనుకుంటుండగానే, అతనే తీసి ఇచ్చేస్తున్నాడు. మీరేమన్నా ఇచ్చారేమో దాంట్లోంచి ఖర్చుపెడుతున్నాడను

కున్నాం"

"నేనేం ఇవ్వలేదు"

క్షణం, మా ఆవిడ మాట్లాడలేదు.

"ఈ ఇల్లు మీ మిత్రుడిదేటగా?"

"అనెవరన్నారు?"

"సెల్వనాయిగం"

నాకు తల తిరగసాగింది. ఏది నమ్మాలో, ఏది నమ్మకూడదో తెలియలా!

:: 2 ::

ఎం.డీ. ఊరెళ్ళడంతో, మర్రోజు ఆఫీసులో ఊపిరి పీల్చుకునే అవకాశం దొరికింది. సెల్వనాయిగం కోసం కబురుపెడితే ఆఫీసుకు రాలేదన్నారు.

తెల్లవారుఝామున, మా అమ్మ సుప్రభాతంలో మధ్య మధ్య సెల్వనాయిగం గొంతు విన్నా, మా ఆవిడతో ఏదో మాట్లాడుతుండగా నే నిద్ర లేచేసరికి లేడు. మా చంటాడిని, పిల్లలను తీసుకువెళ్ళాడుట, విహారానికి!

"కొత్త ఊరు! అందునా మన మాట కాదు. ఆచారం ఉండదు. ఎలారా భగవంతుడా అనుకున్నారా అబ్బాయి! కానీ హాయిగా మనూళ్ళో ఉన్నట్లే ఉంది ఇక్కడ" - మా అమ్మ ఆ ఊరికీ, ఇంటికీ కితాబు ఇచ్చేసింది.

మా ఆవిడ సరేసరి - "మీరు నిశ్చింతగా ఆఫీసు కెళ్ళండి. సెల్వనాయిగం ఉంటే చాలు. ఇండియాను ఏలేయొచ్చు! పిల్లలిద్దరికీ స్కూల్లో ఎడ్మిషన్లు సంపాయించాడుట. స్కూలు కూడా అట్టే దూరం లేదన్నాడు. పైగా స్కూల్ వ్యానొచ్చి తీసుకెడుతుందట. పిల్లలు స్కూలుకు అలవాటుపడే దాకా. తను తోడు వెడతాడట. సాయంత్రం వచ్చి, నన్ను బజారుకు తీసుకుపోయి మార్కెట్ చూపిస్తానన్నాడు. మరిచిపోయినానండోయ్. తెలుగు దిన వారపత్రికలు, నవలలు అద్దెకిచ్చే వాడున్నాడుట. మధ్యాహ్నం ఇంటికి తీసుకొస్తానన్నాడు."

కారు చీకట్లో దారి తెలియక కొట్టుమిట్టాడుతున్న వానికి మబ్బు విడిపోయి, పుచ్చ పువ్వులా వెన్నెలొచ్చినట్లు, నా ప్రాణం హాయిగా ఉంది. కానీ, ఈ ఇల్లెవరిది? దీని అద్దె ఎంత? అసలు ఎన్నాళ్ళు ఈ భోగం అంతా?

ఏ క్షణాన, శివసుబ్రహ్మణ్యం వచ్చేసి ఇంట్లో ఉన్న జనాన్ని చూసి, "ఎవరు మీరంతా? ఇక్కడి కెందుకొచ్చారు? గెటౌట్?" అని రంకెలేసి, మెడ పట్టి గెంటేసి, చెంబూ తప్పేలా విసిరి వీధిలో కేస్తే, అప్పుడు దిక్కెవ్వరూ? సెల్వనాయిగం ఏం చేయగలడు? అయినా సెల్వనాయిగం అన్న శాల్తీ పత్తా ఏదీ? ఆఫీసుకు రాని వాడు నా క్కనపడతాడన్న నమ్మకం ఏముంది?

రంగుల స్వప్నంలా, జీవితం గడిచిపోతుంది. సెల్వనాయిగం మటుకు నాక్కనిపించడం

లేదు. ఇంటికి రావడం, కావలసిన పనులు చేయడం, ఎప్పుడో ఆఫీసులో ప్రత్యక్షమై, "వణక్కం సార్" అనడం తప్ప నింపాదిగా నా కంట పడలేదు.

ఆ నోట, ఆ నోట, వాళ్ళు వీళ్ళు చెప్పిందాన్నిబట్టి -

సెల్వనాయిగం మా ఆఫీసులో తొలిసారి టీ గ్లాసులు మోస్తూ, పదేళ్ల వాడిగా కనిపించాడట. అలా టీలు తెస్తూ, టిఫిన్‌లు అందిస్తూ, ఆ తర్వాత తీరిక సమయాల్లో, ఏదైనా పనులు చెబితే చేస్తూ పెద్దవాడయినాడట.

అలా పెరుగుతూ, అదే భవనంలో ఉంటూ ఉండగా, వో బెంగాలీ దొర దయతలచి ఆఫీసులో అటెండరుగా ఉద్యోగం వేయించాడట.

పేరుకు అటెండరే గానీ, ఏ క్షణమూ, ఏ నాడూ ఆఫీసులో అటెండరు ఉద్యోగం మాత్రం చేయలేదని, అతన్ని గురించి తెల్సిన వాళ్ళు చెప్పిన మాటలు.

కానీ, ప్రతి నెలా జీతం ఇస్తూనే ఉన్నారు. ఓ రోజు సెలవుగానీ, జీతంలో కోతగానీ పెట్టినట్లు, నువ్వు అటెండరువి, కనుక పది నుంచి ఆఫీసులో ఉండి తీరాలి, అన్న ఆంక్షలు ఎవ్వరూ విధించినట్లు లేరు. తల్లీ, తండ్రీ, తోడబుట్టిన వాళ్ళూ లేరు... భార్యా బిడ్డలు కూడా. పగలంతా ఎక్కడుంటాడు? ఎక్కడ తింటాడు? ఏం ఊరు? ఎవరన్నా బంధువులు, మిత్రులు ఉన్నారా?

ఎవ్వరికీ ఏమీ తెలియదు. కానీ సెల్వనాయిగం అందరి వాడు. అందరికీ కావాలి. అందరి పనులూ చేస్తాడు.

మీకు సెల్వనాయిగం కావాలి అని మనసులో అనుకుంటే చాలు ప్రత్యక్షమవుతాడు.

తెలుగు, తమిళం, ఒరియా, బెంగాలీ, హిందీ - అన్నీ వచ్చు.

మా తండ్రి అబ్దీకం వచ్చింది. ఎలారా దేవుడా అనుకున్నా.

సెల్వనాయిగం ఇద్దరు తెలుగు బ్రాహ్మల్ని పట్టుకొచ్చాడు. తెలుగు వంటలు చేసే ఆడమనిషిని తెచ్చాడు. కార్యం నిరాటంకంగా జరిగిపోయింది.

కానీ, ఆ రోజు మా ఆవిడ దుఃఖపడ్డది. కాదు ఏడ్చింది. కారణం.

"సెల్వనాయిగానికి మరీ మరీ చెప్పానండి. సాయంత్రం - 'ఏదో వేళకు భోజనానికి రా' అని. చూశారా అయిపులేడు! నాకు తెలుసు, రాడు. నా కోపం తగ్గాక, పిల్లిలా వస్తాడు వెధవ! నవ్వుతాడు. 'సెల్లెమ్మా తప్పు మణ్ణించు' అంటాడు. అప్పుడు వాడి అవతారం చూశాక, నోరుపెగలదండీ! కొండంత కోపమూ వెన్నలా కరిగిపోతుంది" అన్నది.

నేనేం మాట్లాడేది!

"పోనీ వచ్చినప్పుడన్నా ఇంత టిఫిను, కాఫీ ఇవ్వు" అన్నా.

మా ఆవిడ నన్నో వింత మృగంలా చూసింది. చూసి, "అయ్యో! ఇన్నాళ్ళయ్యిందా! ఇంతవరకూ, నా చేతకాలా వాడిచేత టీ తాగించడం. ఎప్పుడన్నా అడుగు- 'అమ్మణ్ణి ఇప్పుడుదాకా - ఆ సెటర్జీ ఇంట్లో రసగుల్లా తింటిని! నీతో అబద్ధం సెబుతానా సెల్లెమ్మా!'

అంటాడు. అన్నం తినమని, చెబితే చెయ్యి వాసన చూడటానికిచ్చి, 'నిజం సెల్లెమ్మా కాంబ్లే ఇంట్లో కార్యమైంది. దప్పళం తింటిని' అంటాడు. ఆ మధ్య ఓ రోజు వాడితో మాట్లాడలా కోపం వచ్చి. ఏం చేశాడో తెలుసా?"

"ఏం చేశాడు?"

మా ఆవిడ ముహంలో మబ్బులు కమ్ముకున్నాయి. ఆ మబ్బులోంచి వెండి వెలుగులా, సూర్యకాంతీ వచ్చింది. వాన కురిసింది వెలుగొచ్చింది.

"అన్నీ అబద్దాలు చెబుతున్నావ్. బామ్మగారి కాళ్ళు పట్టుకు ప్రమాణం చేయి. నిజంగా అన్నం తిన్నావా?" అంటే సెల్వనాయిగం ఏం చేశాడో తెలుసా? ప్రమాణం చేయలేదు.

అక్కడున్న బూటు తీసుకుని టపాటపా నుదుటి మీద కొట్టుకోసాగాడు. నుదురంతా కమిలిపోయింది. మీ అమ్మగారు మైలపడివాణ్ణి పట్టుకుంది - 'ఛస్తావురా వెధవా' అని. అప్పుడు వాడంటాడు-

"బామ్మవారూ! సెల్లెమ్మ నన్ను నమ్మలేదు తల్లీ! సెల్లెమ్మ అంద మాట అన్నాక జీవం ఎందుకమ్మా అని ఏడ్చాడండీ!" అంది మా ఆవిడ.

సెల్వనాయిగం ప్రవర్తన, ప్రవృత్తి నాకూ అంతుబట్ట లేదు. ఓ రోజు కాపేసి సెల్వ నాయిగాన్ని పట్టుకున్నా. కుందేలు పిల్లలా దొరికినట్లే దొరికి తప్పించుకోబోయాడు. నే వదల్లేదు.

"చెప్పు మేం ఉంటున్న ఇల్లెవరిది? ఆ ఇంటాయన ఎక్కడ కెళ్ళాడు? ఎప్పుడొస్తాడు? ఆయనొస్తే, మేం ఎక్కడుండాలి! ఇప్పుడున్న ఇంటికి అద్దె ఎంత ఇవ్వాలి?" - ఇలా ప్రశ్నల పరంపర, సెల్వనాయిగం పైన కురిపించాను.

సెల్వనాయిగం నే వేసిన ప్రశ్నలన్నిటికీ నవ్వుతూ ఉన్నాడు తప్ప సమాధానం ఓ పట్టాన చెప్పలేదు. నేను పట్టు విడువలేదు. పిండగా, పిండగా, ఓ మాట చెప్పాడు. అవన్నీ విన్నాక నాకు తెలిసిందేమిటంటే -

శివసుబ్రహ్మణ్యం, ఫారిన్ వెళ్ళాడు. వెడుతూ వెడుతూ, ఆ ఇల్లు సెల్వనాయిగానికి ఇచ్చి, "ఎవరికన్నా మంచివాళ్ళకు అద్దెకివ్వు! ఇల్లు జాగ్రత్తగా చూసుకో" అన్నాడు!

"అద్దె ఎంత?"

"ఎంతో నీ ఇష్టం. డబ్బు ముఖ్యం గాదు. ఇంట్లో వస్తువులు, ఇంటి వాతావరణం పాడు కాకుండా ఉంటే అద్దె ఎంతయినా పర్లేదు" అని శివసుబ్రహ్మణ్యం తాళం చేతులిచ్చి వెళ్ళాడు. అదిగో ఆ ఇల్లు మా కప్పచెప్పాడు సెల్వనాయిగం.

"అద్దె ఎంత ఇవ్వాలి?"

"మీ ఇష్టం సార్?" అన్నాడు సెల్వనాయిగం తలొంచుకుని.

వెయ్యి ఇచ్చా. సెల్వనాయిగం తీసుకున్నాడు. మళ్ళీ నెల పదిహేను వందలిచ్చా తీసుకున్నాడు. ఇంకో నెల రెండు వేలిచ్చా తీసుకున్నాడు. వద్దంటాడు - లేదా ఎక్కు

విచ్చారంటాడేమో అనుకున్నా. ఊహూ, సెల్వనాయిగం అనలేదు. ఓ నెల అసలివ్వలేదు. అయినా అద్దె అడుగ లేదు. ఇల్లు, పరిసరాలు బాగున్నాయని నేను ఊరుకున్నా.

ఓ రోజు హఠాత్తుగా శివసుబ్రహ్మణ్యం రానే వచ్చాడు.

వచ్చాడని నా కెలా తెలుసంటే, సరాసరి మా ఆఫీసుకు వచ్చాడు. వచ్చి తాను ఫలానా అని పరిచయం చేసుకున్నాడు. చేసుకుని, "ఇంటి కెళ్ళొచ్చా. బాగుంది. మీరు తెలుగు వాళ్ళటగా? చాలా సంతోషం. మీరు ఇక్కడున్నంతకాలం నిరాక్షేపణీయంగా మా ఇంట్లోనే ఉండండి. అద్దె మీ ఇష్టం. నేను ఇప్పుడే ఇండియా రాను" అని చెప్పాడు. చెప్పి, "నే నీ ఊళ్ళో ఉన్నంత కాలం మీ ఇంట్లో పేయింగ్ గెస్ట్‌గా ఉంటా" అన్నాడు.

నేనొప్పుకోలేదు. ఆ డబ్బుల్దీసుకోను అని ఖరాఖండీగా చెప్పా. మరీ కాదని బలవంతం చేస్తే ఇల్లు ఖాళీ చేస్తానని బెదిరించా!

శివసుబ్రహ్మణ్యం నవ్వాడు.

"ఓ.కె. ఓ.కె. డబ్బు లివ్వను. మీ ఇంట్లోనే ఉంటా సరేనా? సెల్వనాయిగం నాకు ఉత్తరం రాశాడు. మీ గురించీ, మీ ఫ్యామిలీ గురించీ వాడు చెప్పింది రైటే! వాడంటే నాకు గురి, చాల నమ్మకస్తుడు".

కలకత్తాలో చౌకగా మంచి ఇల్లు దొరకడం అదృష్టం. అందునా ఇంటి యజమాని సహృదయుడు. కలుపుగోరు మనిషీ అయితే ఇక అంతకన్నా అదృష్టమేముందీ?

శివసుబ్రహ్మణ్యం పగలంతా ఎక్కడ తిరిగేవాడో ఏమో, సాయంత్రం ఇంటికొచ్చి సరదాగా నవ్వుతూ కబుర్లు చెప్పేవాడు. సెల్వనాయిగం శివసుబ్రహ్మణ్యం వెంట పెంపుడు కుక్కలా తిరిగేవాడు.

ఓ రోజు శివసుబ్రహ్మణ్యం సెల్వనాయిగాన్ని వెంటబెట్టుకు ఆఫీసు కొచ్చాడు. వచ్చి, "వీడు మరీ చెడుపోతున్నాడండీ. మీ రోసాయం చెయ్యాలి" అన్నాడు.

"చెప్పండి. సార్"

"వీడికి పెళ్ళి చెయ్యాలి?"

సెల్వనాయిగం తలొంచుకు నిలబడ్డాడు.

"పిల్లను చూశా? సంబంధం కూడా సెటిలిల్ చేశా. కాకపోతే....."

"చెప్పండి. వాడి కోసం ఏం చేయమన్నా చేస్తా" అని చెప్పా.

"నేను అర్జంటుగా వెళ్ళాలి. మా ఆవిడ దొరికన ఫ్లయిట్‌లో వచ్చేయమంది. వెళ్ళాలి. కనుక వీడి పెళ్ళి భారమంతా మీరే వహించాలి?"

ఒప్పుకున్నా, సంతోషంగా.

"వాడి పెళ్ళి ఖర్చు ఎంతయినా నే పెట్టుకుంటా. ఘనంగా చేయండి. పెళ్ళి జరిగే చోటు, పెళ్ళి పత్రికలు అచ్చు వేయించడం, పెళ్ళి, భోజనాల ఏర్పాట్లు అన్నీ పూర్తి చేశా. మీరు చెయ్యాల్సిందల్లా దగ్గరుండి పెళ్ళి జరిపించడం. అంతేకాదు. పెళ్ళి కాగానే

పెళ్ళి ఫొటోలు పంపండి. పెళ్ళి విశేషాలు నాకు రాయండి".

శివసుబ్రహ్మణ్యం వెళ్ళిపోయాడు.

శివసుబ్రహ్మణ్యం చెప్పిన ప్రకారం సెల్వనాయిగం పెళ్ళి చేశా.

కానీ, ఆయనకు ఉత్తరం రాయడంలో జాప్యం జరిగింది. అందుక్కారణం, ఆయనకు నిజం రాయాలా, అబద్ధం రాయాలా అన్న సమస్య వచ్చిపడ్డది.

మా ఆవిడను సలహా అడిగాను.

"నిజం రాయండీ" అంది.

కానీ నిజం రాయడానికి నాకు మనస్కరించలేదు. పోనీ అబద్ధం రాద్దామంటే ఆ పెద్దమనిషి మనస్సు బాధ పెట్టినట్లవుతుంది.

ఇలా కాలం గడుస్తుండగా శివసుబ్రహ్మణ్యం ఫోన్ చేశాడు, సెల్వనాయిగం పెళ్ళి గురించి. ఇలా ఆయన ఫోన్ చేయడంతో గత్యంతరం లేక కొంత నిజమూ, కొంత అబద్ధమూ కలిపి చెప్పా.

"పెళ్ళి బాగా ఘనంగా జరిగిందా?"

"బాగా అంటే... జరిగింది?"

"అదేం? వాడిచేత నానా చాకిరీ చేయించుకున్న జనం పెళ్ళికి రాలేదా?"

"వాడి తరపున నేనూ, నా కుటుంబమే హాజరయ్యాం. అంతే"

"అంటే ఎవ్వరూ రాలేదన్నమాట. డర్టీ ఫెలోస్... నాకు తెలుసు. వాడిచేత ఉపకారం పొందిన వెధవలంతా వాడికి పెళ్ళయితే వాడిచేత పనులు చేయించుకోవడం కుదరదు. వాడు ఉపయోగపడడని మొహం చాటేస్తారని నాకు తెలుసు. అందుకే పెళ్ళి చేస్తే వాడు బాగుపడతాడని నాకు నమ్మకం."

నేను మాట్లాడలేదు.

"సరే! సెల్వనాయిగం ఎలా ఉన్నాడు?"

"రోజూ పదింటికి ఆఫీసు కొస్తున్నాడు. నో కంప్లెయింట్స్!" ఫోన్ పెట్టేశా.

ఆఫీసు పనితో పాటు నాకు ఇంట్లో పనీ ఎక్కువైంది. అన్నిటికీ నేనే వెళ్ళాల్సి వస్తున్నది. ఎందుకంటే సెల్వనాయిగం తన ఇల్లు, ఆఫీసుకే పరిమితమైనాడు. బద్ధకం పెరిగింది. ఏ పని చెప్పినా ఇదివరకటిలా అల్లుకుపోవడం లేదు. వాడికో ఇల్లు. సంసారం, బరువు బాధ్యతలు ఏర్పడడం కారణమేమో! నా ఊహే ఇది. మా ఆఫీసులో సెల్వనాయిగం ఎవరూ అనంటే ఇప్పుడెవరికీ తెలియదు. వాడి గురించి ఎవ్వరూ ఘనంగా, అప్యాయంగా మాట్లాడరు. కారణం సెల్వనాయిగం ప్యాకింగ్ డిపార్ట్‌మెంటులో అటెండర్ - అంతే!

నేనూ, సెల్వనాయిగం లాంటి మనిషి కోసం ప్రతి ఊళ్ళోనూ వెతుకుతూనే ఉన్నా, ఎన్ని ఊళ్ళు బదిలీ అయినా సెల్వనాయిగం కనిపించలేదు.

అందుకే కలకత్తా అంటే నాకు ఏమీ గుర్తు రావు - ఒక్క సెల్వనాయిగం తప్ప. ●